పాదచారులకు దారేదీ ?

- వ్యాపార కేంద్రాలుగా ఫుట్‌పాత్‌లు
- దీంతో రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- పాదచారులకు ఇక్కట్లు, ట్రాఫిక్‌కు అంతరాయం

నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఫలితంగా పాదచారులకు వెళ్లే దారి లేకపోవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై అటు ఎస్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో పలు వాణిజ్య ప్రాంతాలు, ఆలయ సముదాయాల వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నెల్లూరు నగర జనాభా 8 లక్షలకుపైగా
డివిజన్లు 54


రోడ్డుపైనే నిలిపిన వాహనాలు


చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో ఫుట్‌పాత్‌పైకి విస్తరించిన దుకాణాలు

నెల్లూరు(బారకాసు) : నగరంలో ప్రధానమైన చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో దుకాణాల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లను సదరు యజమానులు ఆక్రమింజేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నగరంలో నుంచి జాతీయ రహదారివైపు వెళ్లేందుకు చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు ఎంతో సౌకర్యవంతంగా ఉంటోంది. దీంతో ఇక్కడి ప్రాంతంలో అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే చిల్డ్రన్స్‌పార్కు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటైన దుకాణాలు, షాపింగ్స్ ముందు ఉన్న ఫుట్‌పాత్‌లను సదరు దుకాణదారుల్లో కొంత మంది టీ, టిఫిన్, పానీపూరి, మిక్చర్ వంటి చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అద్దెకు ఇవ్వడం, అలాగే మరికొంత మంది ఆయా దుకాణదారులే ముందు టెంట్లుగా వేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనివల్ల వచ్చే కస్టమర్లు తమ వాహనాలను రోడ్డులోనే నిలుపదల చేసి ఆయా దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలకు ఇబ్బందులు కలగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఓ వైపు ఫుట్‌పాత్‌లను ఆక్రమించేయడంతో పాదచారులు నడిచేందుకు వీలు లేక తప్పని పరిస్థితుల్లో రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. దీంతో వాహనాలు ఎక్కడ తమను ఢీకొంటాయోనన్న భయాందోళన వారిలో నెలకొంటోంది.

సమన్వయలోపం

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయం లోపించడంతోనే రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి స్పెషల్ డ్రైవ్ పేరున ఆక్రమణల తొలగింపునకు పూనుకునే అధికారులు ఆ తర్వాత ఆ విషయమై పట్టించుకోరని, మళ్లీ యథావిధిగా రోడ్లపైకి ఆక్రమణలు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు సంబంధిత ఎస్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, స్థానిక ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి. వాణిజ్య వ్యాపార కేంద్రాల వద్ద రోడ్లపై పార్కింగ్‌లను నిరోధించి ట్రాఫిక్ సమస్యలను తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి


చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాలు

- స్థానిక వీఆర్సీ క్రీడా మైదానం ముందున్న ఫుట్‌పాత్‌పై బొమ్మల వ్యాపారాలు జోరుగా సాగుతోంది. అలాగే వీఆర్సీ కళాశాల ప్రహరీని(ముత్తుకూరు బ్రిడ్జి సమీపంలో) ఆనుకుని రోడ్డుకిరువైపుల అనధికారికంగా పండ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.
- మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఏసీ కూరగాయల మార్కెట్ ముందు ఫుట్‌పాత్‌పై తోపుడు బండ్లు పెట్టుకుని పండ్ల విక్రయాలు జరుపుతున్నారు. ట్రంకురోడ్డు, గాంధీ పార్కు ముందు ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగించడంతో రోడ్లు, ఫుట్‌పాత్‌లు కుచించుకుపోయి నడిచేందుకు, వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది.
- మినీబైపాస్ రోడ్డు వెంబడి కొందరు షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ షెడ్లను అంతకంతకూ పెంచుకుంటూ రోడ్డు ఆక్రమణలకు పాల్పడటం, దీనికి తోడు అక్కడికి వచ్చే ఆహార ప్రియులు వారి వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి.
- ఆత్మకూరు బస్టాండ్, బాలాజీ నగర్, ముత్తుకూరు గేట్ వద్ద ఉన్న సర్వేపల్లి కాలువ బ్రిడ్జిల పైన ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమింజేసి పండ్లు, కూరగాయలు దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరపడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. అలాగే స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో షాపుల ముందు పండ్ల దుకాణాలు పెట్టుకుని విక్రయాలు జరపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. స్టోన్‌హౌస్‌పేటలో నడిచేందుకు కూడా పాదచారులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
- చిన్నబజార్, పెద్దబజార్, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో రోడ్లపైనే పలు దుకాణాలు వెలిశాయి. దీంతో ఇక్కడికి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

పోలేరమ్మకు ఢంకానాథం బహూకరణ



మనుబోలు: స్థానిక కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో నివేదన సమయంలో వినియోగించే ఢంకానాథాన్ని దాతలు వేముల లక్ష్మి, కుటుంబసభ్యులు ఆదివారం బహూకరించారు. పోలేరమ్మకు అభిషేకాలను నిర్వహించి.. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకుడు శ్రీనివాసులు అందజేశారు. దాతను ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు యారాసి శివమ్మ, కొండా వెంకటరమణయ్య అభినందించారు.

వైభవంగా గ్రామోత్సవం



కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానంలో ఆషాడ మాసం సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కామాక్షితాయికి సారె సమర్పణ



కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదివారం సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



కోవూరు: కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వీఏఏగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న శ్వేతలేఖను గ్రామస్తులు ఆదివారం సత్కరించి, అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో ఆమె సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

వాగుపై బ్రిడ్జిని నిర్మించరూ..



పొదలకూరు: మండలంలోని ఆల్తుర్తి - నావూరు మార్గంలో గల వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలంలో పెద్దవాగు పొంగి ప్రవహిస్తే ఈ మార్గం మీదుగా వాహనచోదకులు వెళ్లలేని పరిస్థితి. భోగసముద్రం, చెన్నారెడ్డిపల్లి, నావూరు, నావూరుపల్లి గ్రామస్తులు ఆల్తుర్తి మీదుగా పొదలకూరుకు వెళ్తుంటారు. వాగు పొంగితే రహదారి మీదుగా వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతాయి. ఆల్తుర్తి రోడ్డులో మద్యం షాపును ఏర్పాటు చేసిన వారు తమ వ్యాపారం తగ్గుతుందని భావించి వాగుపై తాత్కాలికంగా రెండు పైపులను వేసి గ్రావెల్ పోశారు. ప్రస్తుతం ఆటోలు, ద్విచక్రవాహనాలు నడుస్తున్నాయి. వర్షం కురిస్తే తిరిగి పైపులు కొట్టుకుపోయే అవకాశం ఉంది. వాగు వద్ద రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

వెంకటాచలం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఏహెచ్‌టీయూ ఏఎస్సై శ్రీహరి పేర్కొన్నారు. బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై కనుపూరు పంచాయతీలోని ఎస్టీ కాలనీలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ముఠాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని చెప్పారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, శక్తి యాప్, పోక్సో యాక్ట్, మాదకద్రవ్యాల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మర్యాదపూర్వకంగా..


చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన షేక్.మహబూబ్‌బాషా నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పలువురు పార్టీ నేతలతో ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

వధూవరుల వివాహ పరిచయ వేదిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న హెచ్ఆర్ కల్యాణ మండపంలో దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆదివారం నిర్వహించారు. జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం, రాయలసీమ జిల్లాల దేవాంగ సంఘాల ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వందకు పైగా దేవాంగ వధూవరుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర, సంఘ కోశాధికారి కొండపల్లి పరమేశ్వర్రావు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కన్నా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 27 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు జరుగనున్న శ్రావణమాస మహోత్సవాల నిర్వహణకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని జిల్లా డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ సర్కిల్ బ్రాంచి ఉద్యోగుల అసోసియేషన్ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా పొదిలి చిన్నయ్య, అధ్యక్షుడిగా రెహమాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా తాజుద్దీన్, కార్యదర్శులుగా ఎ.శంకరయ్య, పి.సుబ్రహ్మణ్యం, మస్తాన్‌లను ఎన్నుకున్నారు. ఏపీ జేఏసీ అమరావతి కో-చైర్మన్ కొప్పోలు చిరంజీవి, ఆర్అండ్‌బీ శాఖ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు మాట్లాడుతూ ఎన్నికైన నూతన కమిటీ నాయకులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని సూచించారు. అనంతరం ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఉద్యోగుల అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షబ్బీర్ అహ్మద్, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పాల్గొన్నారు.

కాకాణి పూజితతో మాజీ మంత్రి అనిల్ భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితను మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ నగరంలోని వారి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నెల్లూరు(బృందావనం): మినీ బైపాస్‌రోడ్డులోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో జిల్లా గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై, పురస్కారాలను పంపిణీ చేశారు. అనంతరం సంఘ అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు పొందిన 31 మంది విద్యార్థులను సత్కరించి నగదు ప్రోత్సాహకాలు అందించామన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు గిద్దలూరు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి హరిగోపాల్, మాడిశెట్టి గురునాథం, చాకిరాల శేషయ్య, వరికుంట్ల సురేష్‌బాబు, సిరిగిరి సత్యనారాయణ, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

- **నెల్లూరు(బృందావనం):** గాంధీబొమ్మ దగ్గర ఉన్న టీబీఎస్ కల్యాణ సదన్‌లో ఆదిశైవ అర్చక బ్రాహ్మణ సంఘ జిల్లా వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఆరుగురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేశారు. అనంతరం ఆదిశైవ వివాహ పరిచయ వేదిక జరిగింది. సంఘ నేతలు ఐ.కామేశ్వరప్రసాద్, జి.వాసుదేవరావు, కేఎల్ నారాయణ, ఫణిరత్నం, ఉదయగిరి వెంకటశేషాచార్యులు, కొండకావూరు శేషగిరిరావు, గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, ముదివర్తి రవికాంత్‌శర్మ, నూతలపాటి సుబ్బయ్యశాస్త్రి పాల్గొన్నారు.


ఆదిశైవ అర్చక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

నిత్యాన్నదాన పథకానికి విరాళం



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గోమతినగర్‌కు చెందిన కె.రాజశేఖర్‌రెడ్డి- పద్మజ దంపతులు రూ.50,116ల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

మెడికల్ కిట్ల అందజేత




నెల్లూరు(అర్బన్): నగరంలోని వీఆర్సీ గ్రౌండ్‌లో శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత భయ్యా రవి సౌజన్యంతో గుండెపోటును నివారించేందుకు ప్రథమ చికిత్సగా ఉపయోగపడే లోడింగ్ మాత్రల కిట్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఆర్సీ గ్రౌండ్ వాకర్స్ లాఫింగ్ క్లబ్ కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గుండె నొప్పిగా ఉన్నా.. ఛాతిలో మంటగా ఉన్నా ముందస్తు జాగ్రత్తలో భాగంగా మూడు రకాల మాత్రల లోడింగ్ కిట్‌ను తీసుకోవడం ద్వారా గుండెపోటును చాలా వరకు తగ్గించుకోవచ్చని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్‌రావు, వాకర్స్ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది సన్నే సాహెబ్, లాఫింగ్ క్లబ్ సభ్యులు విజయకుమార్, రవికుమార్, రమణారెడ్డి, శివబాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రఘుఆచారి, తాజుద్దీన్, ఎల్‌కే రెడ్డి, నళినీమోహన్, శంకర్‌రెడ్డి, హజరత్తయ్య పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజంలో మార్పు


విశాలాక్షి విరిజల్లులు పుస్తకావిష్కరణ

నెల్లూరు(బృందావనం): సమాజాన్ని, ప్రజలను మార్చగలిగే శక్తి సాహిత్యానికి, రచయితలకు మాత్రమే ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే, తెలుగుభాషోద్యమకారుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో శనివారం జరిగిన విశాలాక్షి మాసపత్రిక 16వ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సాహిత్యం నాలుగు కాలాలపాటు మనగలగాలంటే విద్యావిధానంలో మార్పులు రావాలని ఆకాంక్షించారు. అనంతరం 'విశాలాక్షి విరిజల్లులు' కార్టూన్ సంకలనాన్ని ఆవిష్కరించారు. మామిడిపూడి రామకృష్ణయ్య స్మారకంగా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో విద్యార్థులకు వివిధ విభాగాల్లో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే కథ, కవిత, మినీ కథల పోటీల్లో గెలుపొందిన కవులు, రచయితలకు బహుమతులు అందజేసి సన్మానించారు. 25 కళా సంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆక్వా అథారిటీ బోర్డు చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, శతాధిక గ్రంథకర్త జీవీ పూర్ణచంద్, వివిధ రంగాల ప్రముఖులు పి.కుసుమకుమారి, పీవీఆర్ శివకుమార్, కోసూరు రత్నం, ఈతకోట సుబ్బారావు, బాలయ్య, ఎస్వీఎన్ నాగగాయత్రి, నజ్మా, అంకబాబు, మాధవిసుధ, పి.ప్రసన్న పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం



నెల్లూరు(బృందావనం): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతామహాలక్ష్మి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వైఖానస ఆగమోక్తంగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, అమరా మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి



చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత 30 ఏళ్లుగా విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి తగిన న్యాయం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగుల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా సుమన్ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి తమ యూనియన్ పూర్తి మద్దతు ఇస్తోందని ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి పీఆర్సీ, అరియర్స్ చెల్లించాలని, పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దశల వారీ పోరాటాల్లో భాగంగా ఈనెల 28న ఎస్ఈ, ఈఈలకు, ఆగస్టు 4న కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు గోగుల మహేష్, నాగయ్య, దయాకర్, మస్తానయ్య, రాజు, రామయ్య, లక్ష్మీపతి, ప్రసన్నకుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్, శ్యామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఎప్పుడు?


ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులతో రాష్ట్ర నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు డిమాండ్ చేశారు. పడుగుపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కల్యాణ మండపంలో సంఘ జిల్లా మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీలు ఇచ్చిన నాయకులు నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. దీనిపై రానున్న రోజుల్లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కాయం శ్రీనివాసులు, అల్లాడి గోపాల్‌తో పాటు 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.